# డోలనం

– మధురాంతకం నరేంద్ర

"శశిరేఖది హత్యా? ఆత్మహత్యా?" అని మళ్లీ ప్రశ్నించాడు నిరంజన్.

"మీరు ఆ ప్రశ్న అడగడం ఇది పదమూడవసారి" అంది తార, తన మాటలకు నేపథ్యంగా బలవంతంగా తెచ్చిపెట్టుకున్న నవ్వును ప్రసారం చేస్తూ. ఆ తరువాత "ఈ విషయం గురించి మీకెందుకంత కుతూహలం? మరో కథ రాయడం కోసం వస్తువును వెతుక్కుంటున్నారా ఏమైనా?" అంటూ ప్రశ్నించింది అదే నవ్వును కొనసాగిస్తూ.

దొంగతనం చేస్తూ పట్టుబడిపోయిన దొంగలా నిరంజన్ బిత్తరచూపులు చూడసాగాడు.

కిటికీలోంచి కనిపిస్తున్న ఆకాశంలో నక్షత్రమొకటి నగరపు దీపాలతో పోటీపడలేక వెలవెలబోతోంది. బాల్కనీ పిట్టగోడ పైకి పాకి వచ్చిన మల్లెతీగ గాలివాటుకు రెపరెపలాడుతోంది. కాలనీ రోడ్డుపైన పరిగెడుతున్న వాహనాల సవ్వడి నిరంతరాయంగా వినవస్తోంది. రెండో అంతస్తులో కూర్చున్నా భవనపు క్రింది భాగంలోంచి టెలిఫోను గంట అప్పుడప్పుడూ మోగుతుండడం స్పష్టంగానే వినవస్తోంది.

తెగిన గాలిపటంలా తత్తళించిపోతున్న తన దృష్టిని బలవంతంగా గది లోపలికి మరల్చాడు నిరంజన్. గది గోడలను దాదాపుగా ఆక్రమించేసిన గాజు తలుపుల బీరువాల నిండా సెల్యూట్ చేస్తూ వరసగా నిల్చున్న సైనికుల్లా పుస్తకాలు కొలువుతీరి వున్నాయి. అలమారాల మధ్య మిగిలిన కొద్దిపాటి గోడలపైన గాఢమైన రంగులతో హోళీ జరుపుకుంటున్నట్టున్న ఆధునిక చిత్రికలు వేలాడుతున్నాయి. గదిలో ఓ మూలగా టేబుల్ లైటును అమర్చుకున్న రీడింగ్ టేబుల్ తనపైన కూర్చుని చదువుకోబోయే వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నట్టుగా కనిపిస్తోంది.

మెత్తటి నీలిరంగు సోఫాలో అతడికెదురుగా కూర్చున్న తార, ఇంకే ప్రశ్నలడుగుతావో అడగమని సవాల్ చేస్తున్నట్టుగా నవ్వుతోంది. సీలింగు ఫ్యాను కింద కూచున్నప్పటికీ నిరంజన్‌కు చెమటలు పోయసాగాయి.

"చాలా రోజులుగా మీ పేరుతో ప్రచురించబడే కథలూ, నవలలూ చదువుతూ వున్నాను. అయితే ఆ రచయిత మీరే అయివుంటారన్న విషయం ఇటీవలిదాకా స్ఫురించలేదు నాకు. ఆ రోజు కూడా తటపటాయిస్తూనే ఆ కథ రాసింది. మీరేనా అని అడిగాను. ఇంతకూ మీరా కథ రాసి ఎన్నాళ్లయింది?" అతడి ముఖంలోకి గాలం లాంటి చూపునొకదాన్ని విసురుతూ ఆమె ప్రశ్నించింది.

"కథంటే... మరి... ఏ కథ?" అంటూ నిరంజన్ తప్పించుకోడానికి ప్రయత్నించాడు.

"బొమ్మా... బొరుసు– అదేగదా ఆ కథ పేరు?" అందామె కిశారిస్తున్నట్టుగా నవ్వుతూ.

"అది... అది... అది రాసి ఆరు నెలలు, కాదు... కాదు... నాలుగు, అయిదు నెలలు అయివుంటుం...ది" అన్నాడు నిరంజన్ మాటలు కూడబలుక్కుంటున్నట్టుగా.

తన కిశారింపును మరికాస్సేపటి వరకూ పొడిగించి, అతన్ని బాగా ఇబ్బందికి గురికావించిన తర్వాత "ఇంకో కప్పు కాఫీ తాగండి" అంది తార కెటిల్‌లోని ద్రవాన్ని కప్పులోకి వంచుతూ.

రెండు మూడు నిముషాల వరకూ అతడిలో కనురెప్పల కదలిక తప్ప మరో చలనమేదీ కనిపించలేదు. ఆ తర్వాత బుద్ధిగా కప్పు చేతికి తీసుకుని గబగబా తాగసాగాడు.

కాస్త ముందుకు వంగి, పోట్లాటకు కాలుదువ్వుతున్న పొట్టేలులా తలనదోలా పైకెగరేస్తూ, "కథలో ఆ అమ్మాయికి పేరెందుకు పెట్టలేదు మీరు" అని ప్రశ్నించింది తార.

పెద్దగా పొలమారడంతో నిరంజన్ ఉక్కిరిబిక్కిరైపోయాడు.

"కథలైతే బాగానే రాయగలరు గానీ మనుషులను చూస్తే మాత్రం దడదడలాడిపోతారెందుకు మీరు? మీ కథలోని ఆ పాత్ర అటువంటి పాత్రలకంతా ప్రతినిధిగా కనిపిస్తోంది. కాబట్టి అలాంటి పాత్రకు పేరు పెట్టకుండా, 'ఆవిడ' అని పిలవడమే సమంజసంగా తోస్తోంది నాకు. కానీ కథను మరీ అంత నాటకీయం చేశారెందుకు?" అతడి ఇబ్బందిని పట్టించుకోకుండా ఆమె మరో ప్రశ్నను అతడికేసి రువ్వింది.

"ఎందుకండీ... అది... మరి..." సమాధానమేమి చెప్పాలో తోచక పోవడంతో నిరంజన్ కంగారు పడిపోసాగాడు.

"భలే తెలివైన వాళ్లండీ మీరు! అన్ని ప్రశ్నలకూ నాతోనే సమాధానాలు చెప్పిస్తున్నారు. ఈ ప్రశ్నకు కూడా సమాధానం నేను కనిపెట్టగలిగాను" అంటూ డబ్బారేకుల పైన రాళ్లను దొర్లించినట్టుగా నవ్వేసింది ఆమె. "ఆ పద్ధతిలోనయితే అనవసరంగా కథలోకి తొంగిచూసే కథకుడ్ని అదుపులో పెట్టడానికి సాధ్యమౌతుంది. అంతేగదా...!"

ఆమెకేసి అసహనంగా చూస్తూ, "శశిరేఖది మీ పక్కిల్లేనన్నారు గదా!" అంటూ అడ్డుతగిలాడు నిరంజన్.

తార కాస్సేపు నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఆ తర్వాత "అవును. మా ఇంటి పక్కనుండే అపార్ట్‌మెంట్స్‌లోనే ఆమె వుండేది. ఫ్లాట్ నెంబరు తొమ్మిది. మునుపు ఆ చోట్లో మా ఇల్లు లాంటి ఇల్లే వుండేది. ఈ ప్రాంతానికంతా కమర్షియల్ గారేటొచ్చిన తర్వాత వాళ్లు దాన్ని అమ్మేశారు. బిల్డర్స్ కొనుక్కుని ఆ చోట్లో పన్నెండు ఫ్లాట్లుండే అపార్టుమెంటు కట్టారు. ఆ కాంట్రాక్టరు మా ఇంటిని కూడా తనకు అమ్మేయమని సతపోరాడు. కానీ మా డాడీ ఇవ్వలేదు. ఇప్పుడీ ప్రాంతంలో లాండు బంగారం కంటే ఖరీదు..." అంది వయ్యారంగా ఒళ్లు విరుచుకుంటూ.

"శశిరేఖకు పెళ్లయిందా?" అంటూ మరో ప్రశ్నను సంధించాడు నిరంజన్.

"ఏమో! ఎవరికి తెలుసు? కొందరు అయిందనే అంటారు. పైగా ఆమె భర్త పెద్ద ఆఫీసరన్న రూమరు కూడా వుంది. వాళ్లెందుకు విడిపోయారో మాత్రం ఎవరికీ తెలిసినట్టు లేదు. కానీ... ప్చ్..." చెబుతూ చెబుతూ ఆమె పెదవి విరిచేసింది. "అయినా ఇందులో మీ కథకు ఉపయోగపడే వస్తువేదీ దొరకదని మాత్రం నేను హామీ ఇవ్వగలను. మీ శ్రమంతా వృథానే... కానీ మీ 'బొమ్మా–బొరుసూ' కథ మాత్రం బాగుంది. ప్రధాన పాత్ర మనోగతాన్ని వివరించడం కోసం మీరు చైతన్య స్రవంతి పద్ధతిని వాడుకున్న తీరు నాకు బాగా నచ్చింది."

"మీరు లిటరేచర్ కోర్సేదైనా చేశారా?" అని అడిగాడు నిరంజన్ తన ఉత్సుకతను ఆపుకోలేకపోతూ.

"లేదండీ! నాది ఎమ్మెస్సీ బోటనీ" తనలోకి తాను చూసుకుంటున్నట్టుగా ఆమె చెప్పుకుపోసాగింది. "అయినా సాహిత్యం నాకిష్టమైన సబ్జెక్టు. అందరూ బతికేస్తారు. కానీ సాహిత్యం గురించి తెలిసిన వాళ్లు బతుకుతున్నామన్న స్పృహతో బతుకుతారు. మామూలుగా కథ చదవడం కంటే దాని నిర్మాణం వెనకుండే పనితనాన్ని గమనిస్తూ చదవడం నాకు భలే మజాగా వుంటుంది. వస్తువుదేముంది? జీవితంలో ఎక్కడ పడితే అక్కడ దొరుకుతుంది. దొరికిన దాన్నల్లా కళాత్మకంగా మలచడంలోనే వుంటుంది గొప్పతనం..."

"కానీ జీవితం కంటే గొప్ప ఆర్టిస్టు ఇంకెవరూ వుండరు. చూసే చూపొకటి నేర్చుకోవాలే గానీ, కావల్సిన వస్తువులనంతా అది సరఫరా చేస్తుంది. నిజానికి ఆ కథలోని ప్రధాన పాత్ర లాంటి వ్యక్తిని నిజ జీవితంలో చూశాన్నేను" అన్నాడు నిరంజన్ పులి గుహలోకి అడుగు పెట్టబోయే అమాయకుడిలా ఆమె ముఖంలోకి తేరిపారజూస్తూ.

"నిజంగానా? ఎక్కడ చూశారు?" అంటూ ఆమె అతడి చూపుల్ని అతడికేసే పరావర్తనం చేసింది.

"ఎక్కడంటే... మరి... నిజానికి ఆమె ఒక వ్యక్తి కాదు. ఇద్దరు ముగ్గురున్నారు..." అంటూ అతను తన సమాధానాన్ని సాగదీశాడు.

"అందుకే నేనది ప్రాతినిధ్య పాత్ర అన్నాను. అలా చిన్నచిన్న దొంగతనాలు చేసే వ్యక్తులు చాలామందే వుంటారు..." అందామె.

"కానీ ఆమె అందరి లాంటిది కాదు" అంటూ చివాలున కేకేశాడు నిరంజన్. "ఆ కథ చెబుతున్న వ్యక్తి ఆఫీసులో ఆమె కూడా ఒక ఉద్యోగిని. ఒకరోజు అతడి చేతిలో ఒక అందమైన పెన్ను చూసి బావుందని మెచ్చుకుంటుంది. మరునాడే అది అతడి టేబుల్ పైన్నుంచీ మాయమై పోతుంది. ఇంకో రోజు అతడి జేబులోని కీ–చెయిన్‌ను అందంగా వుందని అంటుందావిడ. అంతే! ఆ తర్వాత అదీ మాయం. ఇలా నాలుగైదుసార్లు జరిగిన తర్వాత గానీ అతడికి అనుమానం రాదు. అనుమానం వచ్చిన తర్వాత ఆవిడ

బ్యాక్‌గ్రౌండేమిటో తెలుసుకోవాలనుకుంటాడు..."

"మీ కథలో నాకు నచ్చిన అంశం అదే! ఆవిడ మానసిక దౌర్బల్యానికి మీరు చెప్పిన కారణాలు నాకు సహేతుకంగా కనిపిస్తున్నాయి. చిన్నతనంలో బీదరికంలో మగ్గడం, ఇంట్లో తోబుట్టువుల మధ్య పోటీ వుండడం, ఆవిడలోని ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సూ, అన్నీ మీరు ఊహించినట్టుగా సమంజసంగా వున్నాయి" అందామె నెమ్మదిగా.

"తార గారూ! మీ నాన్నగారేం చేస్తుంటారు?" గాలిబుడగను సూదితో గుచ్చినట్టుగా నిరంజన్ ప్రశ్న పేలింది. ఆమె ముఖంలోని చిరునవ్వుల తెర వెనుక దేనికోసమో అన్వేషిస్తున్నట్టుగా అతడి చూపులు తారట్లాడ సాగాయి.

"మా ఇంటి ముందు నేమ్ బోర్డును చూడలేదా మీరు..." అంటూ ఆమె తన పెదవుల్ని సాగదీసింది. "మన ఆఫీసులోనే కాదు, ఈ ఊళ్లో ఎవర్నడిగినా సునాయాసంగా ఆయనెవరో చెప్పేస్తారు. ఆయనంత పెద్ద క్రిమినల్ లాయర్ ఈ ఊళ్లోనే లేరని అంటారందరూ!"

"స్వయంకృషితో కష్టపడి పైకొచ్చిన వ్యక్తన్నమాట!" అన్నాడు నిరంజన్ తానేదో నిర్ణయానికి చేరుకున్నట్టుగా.

"అవును. అయితే మా తాతగారు మాత్రం తక్కువ మనిషి కాదు. ఆయన



రోజుల్లో ఆయన కూడా గొప్ప లాయరని పేరుండేది. ఆయన తర్వాత ఆయన ప్రాక్టీసు కూడా మా నాన్న చేతికొచ్చింది. ఆయన నోట్లో బంగారు చెంచాతోనే పుట్టిన మాట నిజం. అయితే ఆ తరువాత ఆ ఆస్తిని ఇన్ని రెట్లుగా పెంచడమన్నది ఆయనకొక్కరికే చేతనవుతుంది. ఆయన్ని మించిన మేధావిని నేనింకొకర్ని చూడలేదు" అంది తార కళ్లు మిలమిల మెరుస్తుండగా.

"మీ నాన్నగారికి మీరు కాకుండా ఇంకెందరు పిల్లలు?"

"నాకు తోబుట్టువులెవరూ లేరు. నేనొక్కదాన్నే. నిజానికీ జర్నలిస్టు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరమేదీ లేదు నాకు. కానీ తిని కూచోవడమంటే నాకు ఇష్టం వుండదు. జీవితాన్ని సవాలుగా తీసుకోవడమంటేనే నాకిష్టం. నావన్నీ మా నాన్న బుద్ధులేనంటుంది మా అమ్మ!" పెద్దగా నిట్టూరుస్తూ నిరంజన్ సోఫాలోకి సోలిపోవడం గమనిస్తూనే ఆమె మాట్లాడటం ఆపేసింది. అతడికేసి పరకాయించి చూస్తూ, "మీకీ ఫ్యాను గాలి సరిపోతున్నట్టు లేదు. ఈ గదికి ఏ.సీ. కూడా ఉంది. ఆన్ చేయమంటారా?" అని వాకబు చేసింది.

"ఫర్వాలేదు. చల్లగానే వుంది లెండి. మిమ్మల్ని చూసినప్పుడు మీరింత పెద్ద ధనవంతులై వుంటారని నేననుకోలేదు" అన్నాడు నిరంజన్ నుదుటికి పట్టిన చెమటను రుమాలుతో తుడుచుకుంటూ. ఆ తరువాత పెద్దగా నిట్టూరుస్తూ, వీపును సోఫాకేసి జారగిలజేశాడు. ఏదో నిర్ణయానికి వచ్చినట్టుగా తలపంకిస్తూ "శశిరేఖకు పిల్లలున్నారా?" అని ప్రశ్నించాడు.

"ఉండకపోతారా? చూడ్డానికి ఏవారా నలభయ్యేళ్లకు తక్కువుండదామె వయస్సు. ఫ్లాట్‌లోనైతే ఆమె ఒకతే ఉంటోంది. ఆమెకిద్దరు పిల్లలున్నారనీ, ఏదో రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకుంటూ వున్నారనీ కొందరంటారు. ఆ ఇంటికి అప్పుడప్పుడూ వచ్చిపోతూ కనిపించే పిల్లలిద్దరూ ఆమె బిడ్డలే అయివుంటారని ఇంకొందరి అభిప్రాయం..."

రహస్యం చెబుతున్న వాడికి మల్లే ముందుకు వంగి, "ఆమె మీకు బాగా దగ్గరి ఫ్రెండనీ, మీ కంటే ఆత్మీయులు తనకెవరూ లేరనీ, ఆమె ఓసారి నాతో అంది" అన్నాడు నిరంజన్.

"నిజంగా!" అటువంటి మాటను జీవితంలో మొదటిసారిగా వింటున్నట్టు కెవ్వున కేకేసింది తార. "ఏదో ఇరుగూపొరుగూ ఇళ్లల్లో వుంటున్నాం. ఒకే పత్రికలో పనిచేస్తున్నాం. అప్పుడప్పుడూ కలిసి ఆఫీసుకు వెళ్తూ వస్తూ వుండేవాళ్లం. అంతేగానీ ఆమె గురించి నాకింకేమీ తెలియదు. నిజానికి ఎవరినైనా తన కాన్ఫిడెన్స్‌లోకి తీసుకునే రకం కాదు ఆవిడ. అంటీ ముట్టనట్టుగా వుండేదెప్పుడూ!" ఇప్పుడేమంటావన్నట్టుగా అతడికేసి ఓ కోరచూపును విసురుతూ "మీకు రాయబోయే కథపైనే దృష్టి. నాకేమో మీరు రాసేసిన కథపైనే ఆసక్తి. బాగానే కుదిరాం ఇద్దరమూ!" అంటూ మెల్లగా నవ్వబోయింది. "ఆ కథలో మీ హీరోయిన్‌కు- అదేనండీ ఆ పేరులేని ప్రాతినిధ్య పాత్రకు- కాంట్రాస్టుగా రూపొందించిన పాత్ర కూడా నాకు నచ్చింది. అన్నట్టు ఆమెకు సుందరి అని పేరుపెట్టడంలో మీ ఆంతర్యమేమిటి? అందుకు విరుద్ధంగా వున్న పాత్రను రాక్షసి అనో, తాటకి అనో, పూతన అనో పిలవాలని గదా మీ ఉద్దేశ్యం?" అంటూ చివరికి అదేదో పెద్ద జోక్ అయినట్టుగా పెద్దగా నవ్వసాగింది తార.

నిరంజన్ బలవంతంగా తన చూపుల్ని ఆమె పైనుంచి దూరంగా మరల్చుకున్నాడు. కిటికీలోంచి ఆకాశంలో రాలుతున్న తోకచుక్కొటి కనబడుతోంది. దూరంగా ఆకాశాన్నంటుతున్నట్టున్న మేడలపైన దీపాల జాతర చెలరేగుతోంది. వీధిముందు పెద్దగా కారు హారనొకటి గొంతు చించుకుంటోంది. ఆ తర్వాత ఇనుప తలుపుల గేటు బడబడమంటూ సవ్వడి చేసింది.

"డాడీ వచ్చినట్లున్నారు. అంటే గంట ఎనిమిదిన్నర అయిందని అర్థం" అంది తార. "డాడీ పంక్చువాలిటీకి మారుపేరు. ఆరుదాకా కోర్టు. ఆ తర్వాత ఎనిమిది వరకూ క్లబ్బులో పేకాట! ఇంటికి రాగానే స్నానం... తొమ్మిదికంతా డిన్నర్... పదకొండు వరకూ లా పుస్తకాలతో కుస్తీ... తర్వాత నిద్ర... అంతా సక్రమంగా జరిగిపోవలసిందే! మీ కథలో సుందరిలాగా అన్నమాట!" తన చివరి మాటకు కవ్వించే నవ్వును జతకలుపుతూ చెప్పింది తార.

"కానీ... సుందరి..." అంటూ కొంత వివరణను సరఫరా చేయడానికి ప్రయత్నించాడు నిరంజన్.

"మంచికీ, క్రమశిక్షణకూ ప్రతీకగా మీరా పాత్రను తయారు చేశారని నేను తెలుసుకున్నాను లెండి! మీ కథకుడు జీతాల రోజున పోగొట్టుకున్న పర్సును తెరిచైనా చూడకుండా అతడికి తిరిగిచ్చేయడం, సమయానికి సరిగ్గా ఆఫీసుకు రావడం, చిత్తశుద్ధితో పనిచేయడం, అన్నీ వివరంగా చెప్పారు మీరు. అంత క్రమశిక్షణ ఆవిడకెలా అబ్బిందో మీరు సహేతుకంగానే ఊహించారు. ఉద్యోగానికే జీవితాన్ని అంకితం చేసిన హెడ్మాస్టరు కూతుళ్లు అలాగే తయారవుతారు. వాళ్ల నాన్న ఆమెకు పొదుపు చేయడమూ, నిజాయితీగా జీవించడమూ నేర్పించే వుంటారు..."

ఆమె మాటల్ని భరించలేనట్టుగా ముఖాన్ని ముడుచుకుంటూ "శశిరేఖ ఫ్లాట్‌కు అతను వస్తూ పోతూ వుండేవాడా?" అని అడిగాడు నిరంజన్.

"అతనంటే?" ఆవిడ ముఖం చిట్లించుకుంటూ ప్రశ్నించింది.

"నెల రోజులుగా దేశంలో వున్న పేపర్లన్నీ ఈ వార్తను రాసీరాసీ అరగగొట్టేశాయి. ఇంకా అతనంటే ఎవరని అడుగుతున్నారా మీరు?" అతడి కంఠంలో కోపం స్పష్టంగా ధ్వనించింది.

"ఇవన్నీ న్యూస్ పేపర్లుగావు. వ్యూస్ పేపర్లని అందరికీ తెలుసు" అందామె చిన్న మూలుగు లాంటి నిట్టూర్పు వదలుతూ. "ఇదిగో తోక అంటే అదిగో పాము అనే రకం ఆట ఇది. జర్నలిస్టన్నాక అధికారంలో వుండే మనుషులతో పరిచయం చేసుకోక తప్పదు. పార్టీలకూ, మీటింగ్‌లకూ పోక తప్పదు. మన జర్నలిస్టులే కొందరు పెద్ద పెద్ద వాళ్లతో పరిచయాల కోసం ఎగబడుతూ వుంటారు. తీరా శశిరేఖలా ఎవరైనా రెండు రోజులపాటు మాయమై పోయినప్పుడు, ఆ తర్వాత శవంగా ఎక్కడో హోటల్ గదిలో ప్రత్యక్షమైనప్పుడు, మనవాళ్లే ఆ పరిచయాలనంతా వెనక్కి తోడతారు. లేనిపోని అపోహల్ని కల్పిస్తారు. అంతా సెన్సేషనలిజం. సర్క్యులేషన్లు పెంచుకోడానికిదొరకం కుతంత్రం..."

"అయితే శశిరేఖ మరణానికీ, అతడికీ సంబంధమేదీ లేదంటారు!" కుతూహలంగా అడిగాడు నిరంజన్.

ఆమె సాలోచనగా తలపంకిస్తూ, "ఏమో! ఎవరికి తెలుసు! నేను చెబుతున్నది ఆమె గొడవ గురించి మాత్రమే కాదు. ఈ జర్నలిస్టు ఉద్యోగంలోకి చేరిన తర్వాత ఇలాంటి కేసులెన్ని చూడలేదు నేను! ఇదంతా మన పేపర్లకు మహా అంటే నాలుగైదు వారాలకు మేత. ఈలోగా ఇంకో సెన్సేషనల్ న్యూస్ దొరుకుతుంది. పత్రికలన్నీ దానితో కలబడతాయి. పత్రికలతోబాటుగా పబ్లిక్ కూడా పాత విషయాన్ని మరచిపోతారు" అందామె.

"ఎంత తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు మీరు?" బలవంతంగా కోపాన్ని అణచుకోవడానికి ప్రయత్నిస్తూ నిరంజన్ విరుచుకుపడ్డాడు. "బహుశా పత్రికల ధోరణి అంతేగావచ్చు. ప్రజల స్వభావమూ అంతే కావచ్చు. అలాగని మనం కూడా చేతులు ముడుచుకుని కూచోవడం ఏం న్యాయం? ఇలా విషయాలనంతా జనరలైజేషన్ చేసి పారేస్తే తప్పులు చేసిన వాళ్లకు శిక్షలెలా పడతాయి? నిర్దోషులను కాపాడే దిక్కెవరు? జర్నలిస్టులుగా మన బాధ్యత ఇదేనా?"

## ప్రవహిస్తున్న వెలుతురు

అతని కళ్లకెప్పుడూ
ఆరిపోని
ఆ దీపపు కాంతి కన్పిస్తూనే వుంటుంది
ఎదురుగాలిని సైతం
వాలుగాలిగా మార్చుకుని
పురోగమిస్తుంటాడు
గతుకుల బాటలో కూడా
నమ్మకం పరదాని పదిలంగా పరచుకొని
పయనించడం అతని ప్రత్యేకత
లోయైనా, శిఖరమైనా
నిబ్బరం నిలువెత్తు జెండా అయి
ఎగురుతుంది
మనసులో మొలిచే కలుపు మొక్కల్ని
ఎప్పటికప్పుడే
ఏరిపారేసే నిత్యకృషీవలుడతడు
నడిసముద్రపు నావనైనా
దరిజేర్చగలననే నమ్మకం
అణువణువునా అతనిలో ప్రతిఫలిస్తుంది
నిలువెల్లా నింపుకొన్న
చైతన్యం
చిమ్మచీకట్లో కూడా
వెలుతురును ఒంపుతుంది
అతని బతుకు బండి
నిత్యం జేగంటలు మోగిస్తూ
కష్టాల కట్టలు దాటుకుంటూ
సాగిపోతూనే వుంటుంది

– సోమేపల్లి వెంకట సుబ్బయ్య

అతనేదో జోక్ చెప్పినట్టుగా ఆమె పెద్దగా నవ్వేస్తూ, "అయితే మీరు మీ కథలో చేసింది మాత్రం జనరలైజేషన్ కాదా? మీ కథలో ప్రధాన పాత్రా, సుందరీ ఇద్దరూ ప్రాతినిధ్య పాత్రలేగావా?" అంటూ ప్రశ్నించింది.

"పాత్రికేయానికీ, కల్పనా సాహిత్యానికీ ముడిబెడుతున్నారేమిటి మీరు?"అన్నారు నిరంజన్ చిన్నపిల్లాడిలా బుంగమూతి పెట్టుకుంటూ. "అది రిపోర్టు. ఇది ఆర్టు. నిజానిజాల్ని విచారించడం విలేఖరుల పని. అటువంటి సమస్యల పూర్వాపరాల్ని కళాత్మకంగా ఆవిష్కరించడం రచయితల విధి."

"జర్నలిస్టే రచయిత కూడా అయినప్పుడు కథలెంత సాధికారంగా తయారౌతాయో మీ కథలు చదివిన తర్వాతే తెలిసింది నాకు" అతడి పైకి మరులుగొల్పేలా దోరదోర చూపుల్ని విసురుతూ ఆమె చెప్పసాగింది. "జర్నలిస్టులకు మంచి జీవితానుభవాలు దొరుకుతాయి. అతడి ఊహను ఛాలెంజ్ చేసే సమస్యలు దొరుకుతాయి. వాటిని కథలుగా మలచినప్పుడు అవి బలంగా తయారౌతాయి..."

ఆమెనలా చూస్తూ నిరంజన్ ఉక్కిరిబిక్కిరైపోసాగాడు. ఆమెలో అంతవరకూ తనకు కనిపించని సౌందర్యమేదో కొత్తగా పురివిప్పు కుంటున్నట్టుగా అనిపించడంతో అతను విభ్రాంతుడైపోసాగాడు. మెల్లగా లేచి, ఆమె పక్కకెళ్లి కూర్చుని, ఆమెను మృదువుగా తన చేతుల్లోకి తీసుకోవాలనే కాంక్ష అతన్ని ముప్పిరిగొల్పేసింది. ఇంతలో తన మాటలకంతా ముక్తాయింపులా, "అందుకే మీ 'బొమ్మా-బొరుసూ' కథ జీవితమంత సహజంగా, ప్రామాణికంగా వుంది" అంది తార. ఆ మాట వినగానే అంతవరకూ తాను సృష్టించుకున్న ఊహా ప్రపంచం గాలిబుడగలా చిట్లిపోవడంతో నిరంజన్ కలవరపడిపోసాగాడు. నూతిలో నుంచీ వెలువడుతున్నట్టుగా గొంతు చిత్రంగా పలుకుతుండగా "మీరు పొగుడుతున్నారో, విమర్శిస్తున్నారో నాకు తెలియడం లేదు" అన్నాడు తడబడుతూ. "ఇక్కడికి రాక మునుపటి వరకూ నేను కూడా ఆ కథ జీవితమంత సాధికారికంగానే వుందని అనుకున్నాను. కానీ నేనెంత పొరబడ్డానో నాకిప్పుడిప్పుడే అర్థమవుతోంది. నా ఊహ సమంజసంగానే అనిపించవచ్చు. అయితే నిజం మాత్రం కాదు."

"మీతో నేను ఏకీభవించలేను..." అంటూ తన మాటలకు చిలిపి నవ్వును మేళవించి, సూటిగా అతడి ఒళ్లోకెళ్లి పడేలా కవ్వింతల్ని రువ్వుతూ చెప్పుకుపోసాగింది తార. "మీకు జీవితం పట్ల ఎంత మంచి అవగాహన వుందో ఈ కథ చదివితే తెలిసిపోతుంది. విషయం సంగతలా వుంచండి. చెప్పిన తీరు ఇంకా ఆకర్షణీయంగా వుంది. చదువుతూ చదువుతూ నేనలాగా మైమరచిపోయాను. మీ కథలన్నింటినీ మళ్లీ ఓసారి నింపాదిగా చదవాలనీ, వాటి నిర్మాణ విశేషాలను గురించి మీతో చర్చించాలనీ అనిపిస్తోంది. కళాకారుడితో కలిసి, అతడి కళ గురించి చర్చిస్తూ జీవించడం కంటే మించిన ఆనందం ఇంకెక్కడ దొరుకుతుంది చెప్పండి!"

ఆమె చూపులతో తన చూపులు జతకలిసిన సంగతినైనా గమనించలేకపోతూ నిరంజన్ మంత్రముగ్ధుడిలా కూర్చుండిపోయాడు.

ఇంటిముందు నుంచీ కాలింగ్ బెల్ సంగీత భరితంగా మోగింది.

అతను ఉలిక్కిపడి చూపులు మరల్చుకున్నాడు. కావల్సిన ప్రతి చర్యేదో అతడిలో కనిపించినట్టుగా తార సంతృప్తిగా నవ్వసాగింది. "ఎవరో గెస్టులొచ్చినట్టున్నారు. చూసొస్తాను. మీరీలోగా పుస్తకాలు చూస్తూ వుండండి..." అంటూ పైకి లేచి మెట్ల మీదుగా కిందికి వెళ్లిపోయింది.

నిరంజన్ పైకి లేచి పుస్తకాల బీరువాల దగ్గరికి నడిచాడు. అద్దాలగుండా పుస్తకాల పేర్లు చదువుకుంటూ ముందుకు కదిలాడు. చేతికి దొరికిన పుస్తకాన్ని తిప్పుతూ రీడింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు. యధాలాపంగా టేబుల్ సొరుగును ముందుకు లాగాడు. కళ్లార్పడం సైతం మరచిపోయి సొరుగులోకే చూస్తూ వుండిపోయాడు. నీలిరంగు జాటర్ రీఫిల్ పేనా, చిన్న బొమ్మకు వేలాడుతున్న కీ-చెయిన్, ఊదారంగు మార్కర్ కలం, పేపర్ వెయిట్‌గా ఉపయోగపడే సైనికుడి బొమ్మ, చిన్న టేబుల్ గడియారం, ఇంకా రకరకాల పేనాలు, బొమ్మలూ, పూసలదండలూ... టేబుల్ సొరుగు చిన్న మాయాబజార్‌లా కనిపించసాగింది అతడికి.

"ఏమిటి చూస్తున్నారు?" అన్న గొంతుక పెద్దగా వినబడ్డాక గానీ తార మేడపైకి తిరిగొచ్చినట్టు అతను తెలుసుకోలేకపోయాడు. అతను కంగారు పడుతూ వెనుదిరిగి చూశాడు. తార సైతం మరో అడుగు ముందుకేసి, అతడు సొరుగు లాగిన వైనాన్ని గమనించసాగింది. ఆమె ముఖంలోని చిరునవ్వుల చాటునుంచీ చిన్న వ్రుక్రోషపు కోర తొంగి చూస్తున్నట్టుగా అనిపించసాగిందతడికి. మరో క్షణంలో ఒక అసహజపు నవ్వు ఆమె ముఖాన్నంతా ఆవరించుకుంది.

"నాకు నచ్చిన వస్తువును దేన్నయినా సంపాదించుకునేటంత వరకూ నేను నిలవలేను. ఊరంతా వెతికి, అవసరమయితే దొరికే చోటేదో తెలుసుకుని, ఎంతయినా వెనకాడకుండా కొనేస్తాను. చిన్నపిల్లల మనస్తత్వం నాది..." అంటూ మరో అడుగు ముందుకేసి టేబుల్ సొరుగును మూసేసింది తార. తరువాత "నాతోబాటు కొత్త ఫ్రెండును తీసుకొచ్చాను చూడండి" అంటూ చేయి వెనక్కు చాపింది.

మేడ మెట్ల పైనుంచి పైకి వస్తూ కనిపించిందొక యువతి.

"నమస్తే! మీరా... రండి" అని ఆహ్వానించాడు నిరంజన్ వెలవెలబోతున్న నవ్వొకటి ముఖానికి తగిలించుకుంటూ.

"నేనేదో కొత్త ఫ్రెండని అన్నాను. మీనాక్షి గారు మీకు పరిచయమేనన్నమాట!" అంది తార. సోఫాపైన కూర్చుని, మీనాక్షికి తన పక్కన స్థలం చూపెడుతూ "కాఫీ తాగుతావా మీనా? మీరూ ఓ కప్పు తాగండి!" అని సమాధానం కోసం ఎదురు చూడకుండా కెటిల్లోంచి కప్పుల్లోకి కాఫీని వంచసాగింది.

"ఆఫీసులో నా సెక్షను కెళ్లాలంటే మీనా గారి సీటు ముందునుంచే వెళ్లాలి గదా! అప్పుడప్పుడూ చూస్తూనే వుంటాను. నమస్తేనండీ! నా పేరు నిరంజన్..." అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు నిరంజన్.

"నమస్తే! మీరు కూడా నిరంజన్ గారిలా కథలు రాయడం కోసం వస్తువును వెదుక్కుంటూ వచ్చారేమిటి ఇలా?" అని అడిగింది తార తన చమత్కారానికి తానే మురిసిపోతున్నట్టుగా నవ్వేస్తూ.

ఆమెకేసి చూసి విస్తుపోతూ "కథలా?... నేనా?.... అదేం లేదు..." అంటూ నవ్వడానికి ప్రయత్నించింది మీనాక్షి. "శశిరేఖ మరణం గురించి ఒక ఆర్టికల్ రాయాలని అనుకుంటున్నాను. అందుకు కొంచెం సమాచారం కావాలి. మీరు ఆమెకు బాగా దగ్గరి ఫ్రెండని తెలిసింది."

"ఎవరన్నారామాట! అంతా అబద్ధం" అమాంతంగా తారకంత కోపమెలా వచ్చిందో మిగిలిన ఇద్దరికీ అర్థంగా లేదు. "మీలాగే ఆమె కూడా ఆఫీసులో నాకు కొలీగ్. మా పక్క ఇంటి ఫ్లాట్లలో వుండేదే అనుకోండి! అంతమాత్రాన నాకు దగ్గరి వ్యక్తి అని అనుకుంటే పొరపాటే! ఆమె గురించి మీ అందరికీ ఎంత తెలుసో, నాకు అంతే తెలుసు."

"ఆ రోజు హోటల్ అశోకలో డిన్నర్‌కెళ్లినపుడు శశిరేఖతోబాటు ఇంకో స్నేహితురాలు కూడా వుందనీ, ఆవిడ మన ఆఫీసులోనే పనిచేస్తుందనీ, ఆమె ఇల్లు శశిరేఖ ఇంటికి పక్కనేననీ పత్రికల్లో వచ్చింది కదా!" అంది మీనాక్షి ఎదుటి వ్యక్తి కోపాన్ని పట్టించుకోనట్టుగా.

"అయితే ఆ స్నేహితురాలు నేనేనని అంటారా మీరు?" క్షణం క్రితం ఆగ్రహంతో మండిపడిన వ్యక్తి ఆవిడగాదేమోనన్న అనుమానం కలిగేలా పకపకా నవ్వేసింది తార. "లేనిపోని వార్తల్ని సృష్టించడంలో మన పత్రికలకు కష్టమేముంది? లేనిపోనివి సృష్టించి వార్తాకథనాల్ని వండడం, పాఠకుల్ని దారితప్పించడం మనకలవాటే గదా! ఇంతకూ మీరా వ్యాసాన్ని ఎవరి కోసం తయారు చేస్తున్నారు? వాళ్లకు నా అడ్రస్సు చెప్పలేకపోయారా? నేనూ రెండు వ్యాసాలు రాసి, కొంచెం

## అక్షరాల కవాతు

లోపలి మనిషి మేల్కోవాలని
కిరణాల కోసం గుండె తలుపులు తెరిచాను
ఏ మూలల్ని స్పృశించాయో
లోపలి మనిషే కాదు
అక్షరాలూ మండుతున్న కణాలై వెలువడ్డాయి
వాడెంత చైతన్యవంతుడయ్యాడో
తడి ఆరిన ఆకలి నాలుకల మీద
అక్షరాల ఫ్లాగ్ మార్చ్ నడిపాడు
వెంటనే ఒక పూనిక
ఆ వెంటనే ఒక తిరుగుబాటు వెల్లువ
అవమానాలకి అకృత్యాలకు తల్లడిల్లిన
ప్రతీ వర్గమూ ఒక్కొక్క సైనిక పటాలం
సైన్యాధిపతి నా లోపలి మనిషే!
ఇక ఇప్పుడు...
అనధికార శాసనకర్తల
ఆదేశాలకే ఎదురుచూపులు
కళ్లు కదిపితే చాలు
నిబద్ధత మరచిన నేతల పాదాల కింది
ఎర్ర తివాచీ కదులుతుంది
ఆపై గుండెల మీద కాళ్లు
చేతులే మారణాయుధాలు.

- కొంపెల్ల కామేశ్వరరావు

డబ్బు సంపాదించుకుంటాను."

"డబ్బుల కోసం రాస్తున్నానని నన్ను ఎద్దేవా చేస్తున్నారల్లే వుంది" చివాలున సమాధానం చెప్పింది మీనాక్షి. "అదేంగాదు. నేనీ వ్యాసాల్ని పాపులర్ పత్రికల కోసం రాయడం లేదు. నా వ్యాసాల్ని ప్రచురించే పత్రికలేవో మీకు తెలిసే వుండాలి. అక్కడా ఇక్కడా సానుభూతిపరుల నుంచీ వసూలు చేసే చందాలతో నడిచే పత్రికలవి. నా వంతు బాధ్యతగా నేనీ వ్యాసాలు రాస్తూ వుంటాను."

"శశిరేఖ మీకు కూడా కొలీగే గదా! ఆ రహస్య స్నేహితురాలు మీరు కూడా కావచ్చు కదా!" అంటూ మరో వాదాన్ని లేవదీసింది తార.

"ఆఫీసులో పనిచేసే చాలామందితో శశిరేఖ అసలు పలికేది గాదని మీకూ తెలుసు. నేనామెతో మాట్లాడింది ఒక్కసారే! ఆ రోజు క్యాంటిన్‌లో ఆమె కాఫీ తాగి వెళ్లిపోయిన తర్వాత ఆమె కూర్చున్న కుర్చీలో పర్సు కనిపించింది. ఆ రోజే శాలరీ డే! పర్సు నిండుగా వుంది. దాన్ని తీసుకెళ్లి ఆమెకిచ్చేశాను. ఆమె థాంక్స్ చెప్పింది. ఆ మరునాడు కనిపించినప్పుడు నేను గ్రీట్ చేశాను. ఆమె కొత్త వ్యక్తిని చూస్తున్నట్టుగా ముఖం పెట్టింది. అదీ నాకు ఆమెతో వున్న పరిచయం..." అంది మీనాక్షి.

"నిరంజన్ గారూ! మీ కథలోని సుందరి పాత్ర ఊహలోంచి పుట్టిందని అనుకున్నాను. ఆ పాత్రకు మూలం మన ఆఫీసులోనే వున్నారని నాకింతవరకూ తెలియనే తెలియదు" అంది తార కళ్లెగరేసి అదోలా నవ్వుతూ.

నిరంజన్ తన ఎదుట కూర్చున్న వ్యక్తులిద్దరినీ కళ్లార్పడం సైతం మరచిపోయి అదే పనిగా చూడసాగాడు.

"ఏదో పత్రిక కోసం కష్టపడి వ్యాసాలు రాయడం, డబ్బులాశించకా పోవడం, దొరికిన పర్సును తెరిచైనా చూడకుండా తిరిగిచ్చేయడం- ఇవన్నీ మీ సుందరి లక్షణాలే గదా!" అంటూ కొనసాగించింది తార.

"అప్పుడప్పుడూ ఇలా కొన్ని విషయాలు యాదృచ్ఛికంగా కలిసినంత మాత్రాన అలా తేల్చి పారేయడం సబబు కాదు..." ముద్దాయిలా సంజాయిషీ చెప్పుకోసాగాడు నిరంజన్.

"నిజాన్ని ఊహించడంలోనే రచయిత ప్రతిభ కనబడుతుంది. పూర్తిగా విరుద్ధమైన పాత్రల్ని తయారు చేసినప్పుడే తేడా స్పష్టంగా కనబడుతుంది. రెండు పాత్రల ద్వారా కథ నడుపుతూ ముగింపుకు చేరుకున్న తీరు సహజంగా వుంది. ముగింపును బలంగా తయారు చేయడం కోసం అంతకు మునుపటి సన్నివేశాలనంతా సమతూకంతో తయారు చేశారు మీరు! అక్కడ మీ జాగరూకత నాకు నచ్చింది..."

తార చెప్పుకుపోతూ వుంటే నిరంజన్ ఆవిడ వైపు చూస్తూ వుండిపోయాడు. కాస్సేపటి తరువాత ఆమె మాటల్ని పట్టించుకోవడం మరచిపోయి, ఆమెనే గమనించసాగాడు. ఆమెనలా చూస్తుంటే అతడికి వర్షాకాలంలో కొండ సానువుల్లో మేఘాల్ని చుట్టుకుని నిలబడే గుల్‌మొహర్ చెట్టు గుర్తుకొచ్చాయి. అప్పుడప్పుడూ కొండ గాలికి ఆ చెట్టు నుంచి ఎర్రటి పూలు రాలుతున్నట్టుగా అతడికి భ్రమ కలగసాగింది. ఆ పూల వాసన తనను ముంచెత్తినట్టుగా అనిపించడంతో అతను విచలితుడై పోయాడు.

"అందుకే ఈ కథలు గిలికే వాళ్లంటే నాకు ఒళ్లు మంట!" అతడి ఊహల్ని నిలువునా కూల్చివేయడమే తన లక్ష్యమన్నట్టుగా మాటల్ని రువ్వుతూ పైకి లేచి నిల్చుంది మీనాక్షి. "మనుషులిక్కడ కనీస అవసరాలు కూడా దొరక్కుండా ఉక్కిరిబిక్కిరై పోతుంటే వీళ్లు తీరిగ్గా ఆకాశంలో ఊరేగుతారు. కొందరు దుర్మార్గుల పాదాల క్రింద అమాయకులు మరికొందరు దయనీయంగా నలిగిపోతూ వుంటే వీళ్లు తీరిగ్గా కళల గురించీ, కళాత్మక గురించీ ఉపన్యాసాలు దంచుతారు. ఇదంతా అమానుషం. నాకీ సోదంతా వినే తీరిక లేదు. శశిరేఖ గురించి కొత్త సంగతులేవైనా చెబుతావేమోనని వచ్చాను. ఇక వెళ్తాను-"

ఏం చేయాలో తోచక తాను కూడా లేచి నిల్చున్నాడు నిరంజన్.

"నీలాంటి దానికే ఈయన సుందరి అని పేరు పెట్టారు. నువ్వంటే ఆయనకెంత ఫాసినేషనో చూడు. నువ్వెళ్తానంటే నీతోబాటే రావడానికి తయారైపోయాడు. ఇప్పటికైనా అర్థమయిందా ఆయనగారి ఆంతర్యమేమిటో!" అంది తార కేరింతలుగొట్టే పాపాయిలా ఎగసిపడుతూ.

మీనాక్షి రివ్వున వెనుదిరిగి, గబగబా మెట్లు దిగి, ఇంటి బయటికి నడవసాగింది. తన నవ్వును మరింతగా గలగలలాడిస్తూ తార కూడా గేటు వరకూ కదలి వచ్చింది. నిరంజన్ నిస్సహాయంగా ముందుకు నడచాడు.

పట్టపగల్లా వెలుగుతున్న వీధి దీపాల మధ్య కాలనీ రోడ్డు ఎండమావిలా మిలమిలా మెరుస్తోంది. దారి పక్కన ఇంటికీ ఇంటికీ మధ్య పెరుగుతున్న చెట్లపైన చీకటి తెరలు కొన్ని పాలిపోయి సోలిపోతున్నాయి. అటూ ఇటూ పరిగెడుతున్న మోటారు వాహనాలు పాదచారుల్ని పట్టించుకోవడం లేదు.

రోడ్డుపైకొచ్చాక కూడా తార నవ్వు తనను వెంటాడుతున్నట్టే తోచసాగింది నిరంజన్‌కు. అతను తిరిగైనా చూడకుండా ముందుకే నడవసాగాడు. అతను వెనకే వస్తున్నా పట్టించుకోకుండా మీనాక్షి వేగంగా అడుగులు సారిస్తోంది. ఒకరి వెంట ఒకరుగా వాళ్లిద్దరూ అలా పది నిముషాలసేపు నడుస్తూనే వున్నారు. కాలనీ ఇళ్లు పలచబడిన తరువాత పెద్ద మైదానమొకటి ప్రత్యక్షమైంది. అక్కడి నుంచి చాలా దూరం వరకూ వీధి దీపాలు లేకపోవడంతో అంతా చీకటిగా వుంది. మైదానానికి తూర్పు వైపున వున్న మలుపుకేసి తిరిగిన తర్వాత, చిన్న టీకొట్టు ముందు ఆగింది మీనాక్షి. రెండు నిముషాల తర్వాత నిరంజన్ కూడా అక్కడికి చేరుకున్నాడు.

"టీ తాగుదామా?" అంది ఆమె. చీకటిలో నిలబడడం వల్ల ఆమె ముఖంలోని భావమేమిటో అతడికి అర్థం కాలేదు. అతను ముభావంగా తలూపాడు.

టీకొట్టులో జనమెవ్వరూ లేరు. టీ బైలరు ముందు నడివయసు మనిషొకతను తూగుతున్నాడు.

"నాకాకలిగా వుంది. మీరు కూడా ఏమైనా తింటారా?" అని అడిగిందామె. అతను మళ్లీ తల వూపాడు.

ఆమె ఓ స్టూలు మీద కూర్చుంటూ "రెండు బన్నులూ... రెండు టీలూ..." అని చెప్పింది కొట్టతనితో.

నిరంజన్ కూడా మరో స్టూలుపైన కూర్చున్నాడు.

"శశిరేఖ మర్డర్ గురించి వ్యాసమేదైనా రాస్తున్నారా మీరు?" అని అడిగిందామె.

టీకొట్టులోని గుడ్డి విద్యుద్దీపపు వెలుతుర్లో ఆమె ముఖంలో తారట్లాడుతున్న క్రీనీడల్ని గమనిస్తూ "వ్యాసంగాదు, కథ రాయాలని అనుకుంటున్నాను. కొత్త సమాచారమేదైనా దొరుకుతుందేమోనని తారను కలిశాను" అన్నాడు నిరంజన్.

"కథ రాయటానికి నిజాలు ఇన్వెస్టిగేషన్ చేసి తెలుసుకోవాలా ఏమిటి?" చికాకుపడుతూ ప్రశ్నించింది ఆమె.

"ఏదో ఒకటి ఊహించి రాయటమే కదా కథంటే?... ఇంతకూ తారను కలవడం వల్ల కొత్త సంగతులేమైనా తెలుసుకున్నారా మీరు?"

"ఎంతో సాహసంతో వాళ్లింటికి వెళ్లినా లాభం లేకపోయింది" అన్నాడతను ముక్తసరిగా.

"ఇందులో సాహసమేముంది?" అన్న ప్రశ్న ఆమె నుంచి వేగంగా దూసుకొచ్చింది.

"సాహసమే! వివరంగా చెప్తేగానీ మీకు అర్థం కాదు" ఆవేదనతో గొంతు జీరబోతుండగా అతను చెప్పసాగాడు. "తార ధనవంతురాలు. బాగా చదువుకుంది. అయినా చిన్న చిన్న దొంగతనాలు చేయడం ఆమెకలవాటు. నా వస్తువుల్నే దొంగిలించింది. నేను కోపంతో ఆవిడపైనే కథ రాశాను. దాన్ని చదివి, అందులోని శైతశిల్పాల్ని మెచ్చుకోవడం మొదలుపెట్టిందామె. ఇంటికి టీకి రమ్మంది. శశిరేఖ గురించేమైనా తెలుసుకుందామన్న ఉద్దేశంతో వెళ్లాను నేను. తీరా వెళ్లాక ఆవిడ ఆ కథ గురించే మాట్లాడసాగింది. నా దగ్గర దొంగిలించిన వస్తువుల్ని నేనావిడ టేబులు డ్రాలలో చూశానన్న సంగతి కూడా ఆమెకు తెలిసిపోయింది. అయినా ఆ కథ తన గురించి రాశానన్న విషయం తెలియనట్టే మాట్లాడుతోంది ఆమె. ఇదంతా నిజమో, నటనో తెలియక నేను తికమకపడిపోయాను. నేనలా ఇబ్బందిపడుతోంటే ఆమె భలే సంతోషపడుతున్నట్టుగా కనిపించింది."

"ఆమె అలా పొగుడుతూ వుంటే మీ ముఖం వెలిగిపోవడం గమనించాన్లెండి!" ఈసారి మీనాక్షి గొంతులో కొంత వెటకారం ధ్వనించింది. "అందుకే నాకు కల్పనలంటే నచ్చదు. ఆవిడకి మీరనుకుంటున్నట్టుగా చిన్న మానసిక వైపరీత్యం గాదు. దాన్ని దుర్మార్గం అంటారు. శశిరేఖ మరణం గురించిన అసలు రహస్యాలు తెలిసిన ఏకైక వ్యక్తి ఆమె. కానీ ఆమె నోరు మూయించడం అధికారంలో వున్న వాళ్లకు లెక్కలో లేనంత చిన్న పని. ఆమెకు కావల్సిందేదో ఆమెకు పారేశారు. ఇక ఆమె నోరు విప్పదు."

కొట్టతను టీ గ్లాసులతోబాటు రొట్టెలు కూడా తెచ్చి టేబుల్ పైన పెట్టి వెళ్లిపోయాడు. రొట్టె విరిచి, టీలో ముంచి తినసాగింది మీనాక్షి.

తానూ రొట్టెను తుంచి టీలో ముంచుతూ "నాకిదంతా తెలియదు. మీరు చెబుతున్నది నిజమేనా? ఆధారాలున్నాయా?" అని అడిగాడు నిరంజన్.

"ఆధారాల్ని అంత సులభంగా దొరకనిస్తారా ఎవరైనా? అందుకే ఈ వెదుకులాట! అధికారంలో వున్నప్పుడు కళ్లు కనిపించవు. వాళ్లకే రూల్సు వర్తించవు. దుర్మార్గాలు చేస్తారు. సులభంగా న్యాయాన్ని కొనేస్తారు. మళ్లీ కొత్త దురాగతాలు కొనసాగిస్తారు.

దీనికంతెక్కడుంది? అటువంటి వాళ్లెంత ఎక్కువగా వుంటే మీకంత మేలు! మీ కథలకు వస్తువుల్ని సమకూర్చేది వాళ్లేగదా?" అందామె నింపాదిగా.

"తిరిగి తిరిగి నామీదే పడుతున్నారేమిటి మీరు?" కంగారు పడుతూ ప్రశ్నించాడు నిరంజన్. "కథలు రాయడం కోసమని దుర్మార్గులుండే ప్రపంచాన్ని కోరుకోవడంలేదు నేను. వాళ్ల దుర్మార్గాలను అణచడం కోసమని కథలు రాస్తాను నేను..."

"కథలు రాయడం వల్ల దుర్మార్గులు మారిపోతారనా మీ నమ్మకం?" ఆమె చిరాకుపడింది. "అదేంగాదు, వాళ్ల భరతం పట్టాలంటే ఆ మార్గం పనికిరాదు."

"మరేమార్గం పనికొస్తుందో చెప్పండి?" అని అడిగాడు నిరంజన్ విస్తుపోతూ.

ఆమె టీ చప్పరిస్తూ తాపీగా "చెప్తే మీరు కూడా ఆ మార్గంలోకి వస్తారా?" అని అడిగింది. "రహస్య పార్టీ గురించి విన్నారా మీరు?" అందామె మళ్లీ తానే.

చేతిలోని గ్లాసులోంచి టీ ఒలికిపోతుండగా "తీవ్రవాదమా?" అంటూ కెవ్వుమన్నాడు నిరంజన్.

"అధికారంలో వున్న వాళ్ల బలమెంతో మీకు తెలియదు" నెమ్మదిగా, స్పష్టంగా చెప్పసాగింది మీనాక్షి. "డబ్బు, స్వార్థం, దుర్మార్గం, అవినీతి వాళ్ల ఆయుధాలు. వాళ్లకు మానవత్వం వుండదు. అమాయకులనూ, సజ్జనులనూ నలిపి పారేస్తారు. వాళ్లను అడ్డుకోవడానికి మరో మార్గం లేదు. వాళ్లు భయపడేది కేవలం చావుకు భయపడని వాళ్లకు మాత్రమే!"

"అందుకని హింసను రూపుమాపేందుకు ప్రతి హింసకు పూనుకుంటారా? ఇదెక్కడి న్యాయం? ఇదేం దుర్మార్గం?" గొల్లుమన్నాడు నిరంజన్.

టీకొట్టు మనిషికి బిల్లు చెల్లించేశాక పైకిలేచి తన సంచిని తీసి భుజానికి తగిలించుకుంది ఆమె. మెల్లగా అడుగులు సారిస్తూ "మరో మార్గం లేదు. ఘర్షణలోంచీ పుట్టేదే శక్తి. దానికి హింస అని పేరు పెట్టేవాళ్లు అందుకు కారణభూతమైన హింసనెందుకు పట్టించుకోరు? హింస వున్నంతకాలం ప్రతిహింస తప్పదు" అంది.

ఆలోచిస్తూనే ఆమె వెంట నడవసాగాడు నిరంజన్. కాసేపటి తర్వాత "కొద్దిరోజుల తర్వాత వీళ్లు కూడా బలమైన వ్యవస్థగా మారిపోతారు. వాళ్లూ మనుషులే కాబట్టి వాళ్లకూ బలహీనతలుంటాయి. వాళ్లూ వాళ్ల శత్రువులు చేసిన దుర్మార్గాలే చేస్తారు. ఆ తర్వాత వాళ్లు మాత్రం ప్రత్యేకంగా సాధించేదేముంటుంది?" అన్నాడు తనను తానే ప్రశ్నించుకుంటున్నట్టుగా.

ఆమె రెండు మూడు నిముషాల తర్వాత పెదవి విప్పింది. "మీ మాటా నిజమే! అనుభవపూర్వకంగా మాకు తెలిసిందీ అదే! ఉద్యమాలూ, ప్రతి ఉద్యమాలూ త్రాసులోని పళ్లాల్లా ఎటు బరువెక్కువైతే అటు ఊగుతూ వుంటాయి. చివరికెప్పుడో ఒకనాటికి వాటి మధ్య తేడా తగ్గిపోతుందని ఆశించక తప్పదు. ఎప్పుడో చెడుగా మారిపోబోతోందని, ఇప్పటి మంచికి తోడ్పడకుండా వుండలేం గదా! మంచిని నమ్మేవాళ్లకు తోడ్పడమొక్కటే ఇప్పుడు మనం చేయగలిగింది?"

మరికొద్ది నిముషాల తర్వాత "మా రచనలు చదివిన వెంటనే మనుషుల్లో పెద్ద పెద్ద మార్పులు రాకపోవచ్చు. అయితే ఏదో కొంతగానైనా మానసిక దృక్పథంలో మార్పు వస్తుంది. అటువంటి చిన్న చిన్న మార్పులనాధారంగా చేసుకుని కొద్దికాలానికి- బాగా ఆలస్యంగానైనా పెద్ద మార్పులు వస్తాయి. అటువంటి మార్పు వల్ల ఎటువంటి అనర్థాలూ వుండవు" అన్నాడు నిరంజన్.

నడుస్తూ నడుస్తూ ఇద్దరూ బాగా నిర్మానుష్యమైన ప్రదేశంలోకొచ్చారు. రోడ్డు పక్కన వరుసగా కనిపిస్తున్న విద్యుత్ స్థంభాల వరుసలో ఒకే ఒక దీపం వెలుగుతోంది. దాని దగ్గరికి వచ్చాక నిలబడి "మీ కథలో సుందరి అనే పాత్ర నాలాగే వుందని తార చెప్పింది. నా గురించి ఏమీ తెలుసుకోకుండానే ఆ కథ రాయగలిగారా మీరు? నిజం చెప్పండి!" అందామె.

"అయ్యయ్యో! ఇంతవరకూ మీ గురించి నాకేమీ తెలియదు'' కాలికి ఎదురుదెబ్బ తగిలినట్టుగా విలవిలలాడిపోసాగాడు నిరంజన్. "ఆ కథ రాసింది మాత్రం తార గురించే! అయితే ఆమెకు కాంట్రాస్ట్‌గా వుండడం కోసం ఒక ఆదర్శమూర్తిని తయారు చేశాను. ఆమెకు సుందరి పేరు పెట్టాను. కానీ ఇప్పుడు నా ఊహ చాలా ప్రాథమికంగానే వుందని అర్థమవుతోంది. నేననుకున్నట్టుగా తారకున్నది చిన్న మానసిక దౌర్బల్యమేమీ కాదు. అలాగే సుందరి లాంటి ఆదర్శమైన పాత్రకు కూడా కొన్ని పరిమితులుంటాయి. మిమ్మల్ని చూశాకే నాకీ సంగతి స్ఫురించింది."

మీనాక్షి తలపంకిస్తూ ముందుకు అడుగేయబోయింది.

"మీనాక్షి గారూ! మీదేవూరు? మీ అమ్మా నాన్న ఏం చేస్తుంటారు?"అని అడిగాడు నిరంజన్.

"మా నాన్న చదువుకోలేదు. మేస్త్రీగా పనిచేసేవారు. పనులు వెతుక్కుంటూ ఊళ్లు తిరిగేవాళ్లం నా చిన్నతనంలో. కాయకష్టం చేయక తప్పదంతో మా నాన్నకు తాగుడు అలవాటయింది. ఆరోగ్యం పాడై ఆయన చిన్నయస్సులోనే పోయాడు. మా అమ్మే నాలుగిళ్లల్లో పాచిపని చేసి మమ్మల్ని పెంచింది. మా తమ్ముడికి చదువంటలేదు. ఎక్కడో మేస్త్రీగానే పనిచేసుకుని బతుకుతున్నాడు. మా అమ్మ పోయి రెండేళ్లయింది..." కావల్సిన సమాచారాన్నంతా వెల్లడించిందామె.

కాస్సేపటి తర్వాత మెల్లగా నవ్వేస్తూ "మీరా వివరాలన్నీ అలా ఎందుకు వివరంగా చెప్తున్నారో నాకు తెలుసు! నా కథలో సుందరికి ఇందుకు భిన్నమైన నేపథ్యాన్నే ఊహించాను నేను. నిజానికి బతుకులో వుండే వైచిత్రే అది. నిజం ఊహకంటే విచిత్రంగా వుంటుందొకోసారి. అలాగే ఊహ నిజం కంటే సహజంగానూ వుంటుందింకోసారి..." అన్నాడతను.

ఆమె సాలోచనగా తల పంకించింది.

"శశిరేఖ మరణం గురించి తెలుసుకుని కథ రాద్దామన్న ఉద్దేశంతోనే తార ఇంటికెళ్లాను. ఆ ప్రయత్నం నెరవేరలేదు. అయితే మరో కొత్త కథకు వస్తువు దొరికింది. కథకుడు పాత్రై, పాత్రలు వ్యక్తులై, వ్యక్తులు పాత్రలుగా మారిపోయే విచిత్రమైన కథ అది. ఈ వాక్యంతోనే కథను ప్రారంభిస్తాను. ఎలా ఉంటుంది?" అని అడిగాడు నిరంజన్ ఉద్వేగంతో.

ఆమె కాస్సేపతడికేసి సూటిగా చూపులు సారించాక దీర్ఘంగా నిట్టూర్చింది. "జీవితంలో ఏం జరిగినా అందులోంచి కథలకు వస్తువులను వెదుక్కోవడమే అలవాటైపోయింది మీకు! ఇదొక జాడ్యం. ఇందులోంచి మీరు బయటపడలేరు!" అంది.

"ఎదుటి మనిషిలో తప్పుల్ని వెతుకుతూ మిమ్మల్ని గురించి ఆలోచించడం మీరు మరచిపోలేదూ? ఇదీ అంతే! కానీ నేను మంచినీ, చెడునీ వేర్వేరుగా చూపెట్టడం ద్వారా పాఠకుడ్ని మంచి వైపుకు మొగ్గిస్తాను. చూస్తూ వుండండి. ఈ కథలోని కథకుడు ఆ మంచి పాత్రను పెళ్లి చేసుకుంటాడు..." అన్నాడతను.

ఆమె కాస్సేపు నిశ్చేష్టురాలై నిల్చుండిపోయింది.

ఆ తరువాత మెల్లగా చిన్న చిరునవ్వు నవ్వింది. మరేమీ మాట్లాడకుండా వెనుదిరిగి నడవసాగింది. నిరంజన్ అక్కడే నిలబడి, తడబాటేమీ లేకుండా ముందుకే సాగిపోతున్న ఆమె వైపుకు చూస్తూ ఉండిపోయాడు.

క్రమంగా ఆమె కనుమరుగైపోయింది.

మీనాక్షి చిరునవ్వు మాత్రం నిరంజన్‌ను చాలాకాలంపాటు వెంటాడుతూ ఉండిపోయింది. ●

## కొక్కొరొకో

కారిన రక్తం
జారిన పైట
చెదిరిన శీలం
దొర్లిన మొండెం
వాలిన తల
చాలని లంచం
పోయిన తుపాకి
బహుమతి ఎర
కుక్క చావు
కొక్కొరొకో
లేవగానే హాట్‌హాట్ వార్తల కాఫీ తాగాలి
మెదడు గడ్డకట్టకుండా
కూంబింగ్‌ల తూటాలకి
బులెట్ ప్రూఫ్ జాకెట్ అడవి
పవర్‌ఫుల్ బైనాక్యులర్ సాక్షిగా
ఏరియల్ సర్వే విఫలం
పచ్చనాకుల మధ్య
పసిరిక పాముల వేట
మంచు కోటల భద్రతకి
నిప్పుతో కాపలా
ఏమీ సాధించలేదని అర్థమయ్యాక కూడా
సాధన చేయటం ప్రారంభించకపోతే ఎలా?
పరిగెత్తినా గమ్యం చేరలేనపుడు
తప్పటడుగులు వేస్తే ఎలా?
కాలిపోయిన ఠాణా సాక్షిగా
వాడు రాయిగా మారకముందే
నిర్బంధ అద్దాన్ని మూయకపోతే ఎలా?
పేలిపోయిన స్టేషన్ల సాక్షిగా
పేరుకుపోయిన భ్రమల తెర దించి
చర్చల తెర ఎత్తకపోతే ఎలా?
పరిగెత్తలేమని తెలిసిపోయాక కూడా
నడక మానటం ఆపకపోతే ఎలా?

*- జి. విజయలక్ష్మి*